క్లుప్తంగా

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం


ములకలేడులో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

శెట్టూరు: ప్రశాంత ఎన్నికలే లక్ష్యమని తహసీల్దార్ శ్రీదేవి, ఎస్ఐ రాంభూపాల్ అన్నారు. శనివారం మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి తహసీల్దార్ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ములకలేడు, పెరుగుపాళ్యం, పర్లచేడు, ఖైరేవు, బచ్చేహళ్లి, ఐదుకల్లు గ్రామాల్లో ప్రత్యేక సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉందని, ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరూ పాటించాలని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి తలారి కృష్ణ పరామర్శ

శెట్టూరు: ఎర్రబోయినపల్లికి చెందిన బోయ కృష్ణమూర్తి కుటుంబాన్ని ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య సోదరుడు కృష్ణ శనివారం పరామర్శించాడు. మృతుడి కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో కన్వీనర్ శివన్న యాదవ్, వైస్ ఎంపీపీ ముత్యాలు, నాయకులు రాము, హిమావలీ, వెంకటరమణ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించండి

బొమ్మనహాళ్: మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రజలకు తెలియజేయాలని ఎన్నికల విభాగం జాయింట్ కలెక్టర్ వినీత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఎన్నికలకు ఏర్పాట్లు ఎలా చేశారని ఆరాతీశారు. ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో ఉన్న వాహనాలను తనిఖీ చేశారు. తహసీల్దార్ రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

నంబర్-1 పోలింగ్ బూత్ మలపనగుడి


రాయదుర్గం అసెంబ్లీ ఎన్నికల్లో మొదటి పోలింగ్ బూత్ ఇదే

రాయదుర్గం: నియోజకవర్గంలో ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. అర్బన్ సహా ఐదు మండలాల్లోని 296 పోలింగ్ భూత్‌లు ఏర్పాటు చేశారు. వీటి పరిధిలోని 2,64,352 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందులో నంబర్-1 పోలింగ్ భూత్ డి హీరేహాళ్ మండలంలోని మలపనగుడి కాగా, అభ్యర్థుల భవిత్యంకు ముగింపు పలికే చిట్టచివర 296 పోలింగ్ భూత్ గుమ్మఘట్ట మండలం రంగచేడు లో ఉంది.

ఓటర్లకు టీడీపీ నాయకులు తాయిలాలు

బొమ్మనహాళ్: మండలంలో టీడీపీ నాయకులు ఓటర్లకు తాయిలాలు ఇచ్చారు. ప్రతి ఇంటికీ కిలో చికెన్, ఓటుకు రూ.1000, చికెన్ తినని వారికి కిలో స్వీట్ బాక్స్, మద్యం తాగేవారికి కర్ణాటక టెట్రా ప్యాకెట్లు పంపిణీ చేశారు. పగలు టీడీపీ చీటీలు (కార్డులు) ఇస్తూ రాత్రి డబ్బులు పంపిణీ చేస్తున్నారు. గ్రామాల్లో ఓటరు జాబితానే వేరు చేసి, టీడీపీకి అనుకూలంగా ఉన్న వారికి ముందుగానే స్లిప్పులు పంపిణీ చేస్తున్నారు. వాటి ఆధారంగా ఓటుకు రూ.1000 పంపిణీ చేశారు. మండలంలోని ఉద్దేహాళ్, ఉంతకల్లు, దర్గాహొన్నూరు, బొమ్మనహాళ్, కొలగానహళ్లి, శ్రీధరఘట్ట, ఉప్పరహాళ్, ఎల్‌బీ నగర్, నేమకల్లు, బండూరు గ్రామాల్లో జోరుగా పంచారు. ఓటర్లకు ఇళ్ల వద్దకు వచ్చి టీడీపీ గుర్తు ఉన్న స్లిప్పులు చూపితే డబ్బులు ఇచ్చారు.

సమస్యాత్మక గ్రామాల్లో పటిష్ట బందోబస్తు

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలోని సమస్యాత్మక గ్రామాల్లో డీఎస్పీ శ్రీనివాసులు నేతృత్వంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కళ్యాణదుర్గం నార్త్ హైస్కూల్ ఏరియా, గోళ్ల, ముద్దినాయనపల్లి, కంబదూరు, గొల్లపల్లి, నూతిమడుగు, రాళ్లపల్లి, శెట్టూరు, చిన్నంపల్లి, కుందుర్పి, నాగిరెడ్డిపల్లి గ్రామాలను పోలీసులు సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు. నియోజకవర్గంలో డీఎస్పీ, ముగ్గురు సీఐలు, ఏడుగురు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది 260 మంది, ఏపీఎస్‌పీ బెటాలియన్ 25 మంది, ఇండియన్ రిజర్వ్ ఫోర్స్ 85 మందితో పాటు మొత్తం 581 మంది పోలీసు సిబ్బందిని నియమించామని డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు.

సార్వత్రిక ఎన్నికల్లో సుమారు 4 వేల మందికి పైగా రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ రాణి సుస్మిత తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేలా అన్ని ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశామన్నారు.

కళ్యాణదుర్గం..ప్రగతి పథం

మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధికి బాటలు
- రూ.9.70 కోట్లతో మున్సిపల్ కాంప్లెక్స్‌ల నిర్మాణం
- ఆదర్శంగా రూపుదిద్దుకున్న జగనన్న కాలనీలు
- 30 పడకల నుంచి 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్



కళ్యాణదుర్గంలో ఆధునిక వసతులతో నిర్మించిన సీహెచ్‌సీ భవనం

కళ్యాణదుర్గం: టీడీపీ హయాంలో పాలకులు స్వలాభం కోసం మున్సిపాలిటీ అభివృద్ధిని విస్మరించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత కళ్యాణదుర్గం మున్సిపాలిటీ ప్రగతి పథంలో నడిచింది. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సచివాలయాల ద్వారా సంక్షేమ పథకాలు అందించారు. ప్రజలకు మౌలిక వసతులైన తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీలను ప్రత్యేక నిధులతో నిర్మించారు. మున్సిపాలిటీ పరిధిలో ఏ ఒక్కరికీ ఇంటి స్థలం, ఇల్లు ఇచ్చిన దాఖలాలు లేవు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత కళ్యాణదుర్గం రూపురేఖలు మారాయి.

రూ.43.56 కోట్లతో ఇళ్ల నిర్మాణాలు:

కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో జగనన్న కాలనీలు ఆదర్శంగా రూపుదిద్దుకున్నాయి. కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో మొత్తం 4 లే అవుట్లలో నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు నిర్మించారు. ఐదేళ్లలో 2,420 మంది నిరుపేదలకు ఏకంగా రూ.43.56 కోట్లతో ఇళ్లను నిర్మించనున్నారు. ప్రస్తుతం వివిధ దశలలో ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయి.

30 పడకల నుంచి 50 పడకల ఆస్పత్రి:

కళ్యాణదుర్గం మున్సిపాలిటీ కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రిని 30 పడకల నుంచి 50 పడకల ఆస్పత్రిగా రూపాంతరం చెందింది. వైఎస్సార్‌సీపీ అధికారంలో రాగానే రోగులకు నాణ్యమైన వైద్యం అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాస్పత్రుల రూపురేఖలను మార్చివేశారు. వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా అన్ని సౌకర్యాలతో ఆస్పత్రిని రూ.3 కోట్లతో అభివృద్ధి చేశారు.

అదనపు నిధుల వివరాలిలా...:

- మున్సిపల్ కాంప్లెక్స్ నూతన భవన నిర్మాణానికి ఏకంగా రూ.9.70 కోట్లు వెచ్చించింది.
- గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా 24 వార్డులలో మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం రూ.2.20 కోట్లు నిధులు విడుదల చేసింది.
- 15వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ.4.32 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల తవ్వకం పనులకు ఖర్చు చేశారు.

కళ్యాణదుర్గం మున్సిపాలిటీ సమాచారం..

కళ్యాణదుర్గంలో మొత్తం వార్డులు	: 24
మున్సిపాలిటీ జనాభా	42 వేలకు పైగా
మున్సిపాలిటీలో ఇళ్ల సంఖ్య	12 వేలు
మున్సిపాలిటీలో మొత్తం ఓటర్ల సంఖ్య	36,322
మొత్తం మహిళా ఓటర్ల సంఖ్య	17,476
మొత్తం పురుష ఓటర్ల సంఖ్య	18,844

- ప్రస్తుతం రూ.3.12 కోట్ల పనులు పూర్తయ్యాయి.
- మున్సిపాలిటీలో రెండు అర్బన్ హెల్త్ క్లినిక్ సెంటర్ల కోసం రూ.1.60 కోట్లతో భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయి.
- ఎంపీ నిధులతో మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డులలో వీధిలైట్ల ఏర్పాటు, మైనర్ వర్కులకు సుమారు రూ.90 లక్షలు నిధులు ఖర్చు చేశారు.

కళ్యాణదుర్గం మున్సిపాలిటీ సచివాలయం వారీగా అందించిన నిధులు

దొడగట్ట సచివాలయంలో	రూ.16.85 కోట్లు.
ఒంటిమిద్ది సచివాలయంలో	రూ.17.80 కోట్లు
ముదిగల్లు సచివాలయంలో	రూ.16.23 కోట్లు
రెవెన్యూ కాలనీ సచివాలయంలో	రూ.18.16 కోట్లు
మారెంపల్లి కాలనీ సచివాలయంలో	రూ.19.07 కోట్లు
కుమ్మర వీధి కాలనీలో	రూ.20 కోట్లు
వడ్డే కాలనీ సచివాలయంలో	రూ.17.33 కోట్లు
ఇందిరమ్మ కాలనీ సచివాలయంలో	రూ. 20.15 కోట్లు
కుమ్మర వీధి సచివాలయంలో	రూ.21.64 కోట్లు
ఎస్సీ కాలనీ సచివాలయంలో	రూ.18.67 కోట్లు
కన్నేపల్లి రోడ్డు సచివాలయంలో	రూ.16.33 కోట్లు.


ఊరును తలపిస్తున్న కురాకుల తోట లే అవుట్

- స్వచ్ఛ భారత్ పథకం కింద అదనంగా రూ.40 లక్షలు నిధులను ప్రభుత్వం విడుదల చేసింది.

ఇంటి బాడుగ తప్పింది


మాకు సీఎం వైఎస్ జగనన్న ఇచ్చిన ఇంటితో సంతోషంగా ఉన్నాము. నేను నా భర్త రంగస్వామి కూలీ పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నాము. గతంలో పార్వతి నగర్‌లో ఉంటూ నెలకు రూ.3 వేలు బాడుగ కట్టే వాళ్లం. ఇప్పుడు ఆ సమస్య తీరింది. ఇదంతా సీఎం వైఎస్ జగనన్న వల్లే మాకు సొంతింటి కల నెరవేరింది.

– రాజేశ్వరి, గృహిణి, కురాకులతోట

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి


వైఎస్సార్‌సీపీతోనే మున్సిపాలిటీ అభివృద్ధి జరిగింది. మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ చేయడం ఎంతో సంతోషం. వార్డు సచివాలయాల ద్వారా రూ.కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు అందించడం చరిత్రలో నిలిచిపోతుంది. పట్టణంలో ఆస్పత్రుల నిర్మాణం, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులు చేయడం మంచి పరిణామం.

– సుధీర్, కళ్యాణదుర్గం

సీఎం జగన్ ఆశీస్సులతో అభివృద్ధికి కృషి


కళ్యాణదుర్గం మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా మున్సిపాలిటీలో వార్డుల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు గడప గడపకూ మన ప్రభుత్వం నిధులను కేటాయించారు. ఎంపీ నిధులతో అన్ని వార్డులలో తాగునీటి కోసం బోర్ల తవ్వకంతో తాగునీటి సమస్య రానీయకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో మరింత అభివృద్ధి చేస్తాం.

– తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి

అంజన్నకు అభిషేకం

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు అంజన్నకు శనివారం అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు.

ఒకరికి గాయాలు

బ్రహ్మసముద్రం : మండల కేంద్రానికి చెందిన గొల్ల మంజన్న శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అతన్ని మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

అతివేగంగా వచ్చి కార్లను ఢీకొన్న లారీ

కళ్యాణదుర్గం రూరల్: అతివేగంగా వచ్చి లారీ రెండు కార్లను ఢీకొనింది. పట్టణ పోలీసులు తెలిపిన మేరకు ముదిగల్లు బైపాస్ వద్ద శనివారం తాడిపత్రి నుంచి అతి వేగంగా వచ్చిన లారీ వేగాన్ని నియంత్రించలేక ఎదురుగా వస్తున్న కారును, కర్నూలుకు చెందిన మరో కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వర్లీ గ్రామానికి చెందిన లోకేష్ రెడ్డి, కర్నూల్‌కు చెందిన కారు డ్రైవర్ మహేష్ స్వల్పంగా గాయపడ్డారు.

టీడీపీ ప్రచారంలో అంగన్‌వాడీ ఆయా


అడిగుప్ప ప్రచారంలో పాల్గొన్న మంజుళ

గుమ్మఘట్ట: మండలంలోని అడిగుప్పలో టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ ప్రచారం చేశాడు. ఈ ప్రచారంలో అంగన్‌వాడీ ఆయా మంజుల పాల్గొని, టీడీపీకి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించింది.

అభివృద్ధి, సంక్షేమమే అభిమతం

- 'సాక్షి' ఇంటర్వ్యూలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి


మాట్లాడుతున్న మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా ఎంతో అనుభవం ఉంది. వైఎస్సార్‌సీపీ పాలనలో అతికీలకమైన ఏపీఐఐసీ ఛైర్మన్‌గా నాలుగేళ్లు పనిచేశారు. ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులతో పాటు దేశంలోని ప్రముఖ పారిశ్రామిక వేత్తలతోనూ పరిచయాలు ఉన్నాయి.. వ్యాపార రంగాల్లోనూ ఆరితేరిన వ్యక్తి. మృదు స్వభావి. ఆది నుంచి చిన్న అవినీతి మరక కూడా లేని వ్యక్తి. అభివృద్ధి, సంక్షేమమే తన అభిమతమని చెప్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి శనివారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని, తాను ఎమ్మెల్యేగా గెలుపొందుతానని ధీమా వ్యక్తం చేశారు.

సాక్షి: ఎన్నికల్లో గెలుపొందితే రాయదుర్గం ప్రాంతానికి ఎలాంటి ప్రాధాన్యత ఇస్తారు?

మెట్టు: ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుస్తామన్న నమ్మకం ఉంది. ఏపీఐఐసీ ఛైర్మన్‌గా పనిచేసిన అనుభవంతో రాయదుర్గం ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు పెద్దపీట వేస్తాం. ఇప్పటికే సోలార్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీన్ని మరింత విస్తరించి, 30 వేల ఎకరాల్లో రూ.15 వేల కోట్లతో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు కృషి చేస్తాం. తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 10 వేల మందికి ఉపాధి లభిస్తుంది. ఎకరాకు రూ.32,500 వేలు రైతుకు నిఖర ఆదాయం వస్తోంది. డీ హీరేహాళ్ మండలం జాజరకల్లు వద్ద రూ.544 కోట్లతో ఇథనల్ ఇందన తయారీ పరిశ్రమ ఏర్పాటుకు సీఎం జగన్ వర్చువల్‌గా భూమి పూజ చేశారు. వెయ్యి మందికి ఉపాధి లభిస్తుంది. ఎల్‌ఈడీ, ప్లాస్టిక్ బాటిళ్ల తయారీ పరిశ్రమలు తెస్తాం. స్థానికులకే ఎక్కువ శాతం ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. మూతపడిన కుద్రేముఖ్ పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తాం.

సాక్షి: వ్యవసాయం, రైతుల సంక్షేమానికి ఎలాంటి కృషి చేస్తారు?

మెట్టు: జీడిపల్లి రిజర్వాయర్ నుంచి బీటీపీకి కృష్ణ జలాలు తీసుకొచ్చి నియోజకవర్గంలోని 56 చెరువులు నింపేలా ప్రణాళికలు చేపట్టాం. ఇప్పటికే హెచ్ఎల్‌సీ ద్వారా వచ్చే నీరు డీ హీరేహాళ్, కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో సుమారు 38 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. దీనికితోడు బీటీపీ నీరు కూడా వస్తే సుమారు లక్ష ఎకరాలకు సాగునీరు అందించొచ్చు. ఆ ఆలోచనతో ఉన్నాం. రైతు సాగు ప్రయోజనాలను కాపాడుకుంటాం. బ్యాంబో సాగు విస్తరించేలా కృషి చేస్తాం.

సాక్షి: రాయదుర్గంలో గార్మెంట్స్ పరిశ్రమలకు ప్రాధాన్యత ఉంటుందా?

మెట్టు: రాయదుర్గం అంటేనే గార్మెంట్స్ పరిశ్రమలకు పెట్టింది పేరు. గార్మెంట్స్ రంగం అభివృద్ధికి పెద్దపీట వేస్తాం. విద్యుత్ రాయితీ దక్కేలా ప్రభుత్వాన్ని ఒప్పిస్తాం. సరుకు రవాణాకు అవసరమయ్యే జీఎస్‌టీ విషయంలోనూ బళ్లారి వరకు సడలింపు ఇచ్చేలా ప్రతిపాదన తీసుకెళ్తాం. ప్రత్యేక యూనిట్లు నెలకొల్పేందుకు అవసరమైన రాయితీరునాలు మంజూరు చేయిస్తాం. మార్కెటింగ్ రంగాన్ని అనుసంధానం చేసి, విదేశాలకు ఎగుమతి చేసేలా చర్యలు చేపడతాం.

సాక్షి: ఎడారి నివారణకు శాశ్వత చర్యలు చేపడతారా?

మెట్టు: కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో ఎడారి నివారణ పేరుతో టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు మంత్రిగా ఉన్న సమయంలో రూ.కోట్లు కొల్లగొట్టారు. ఇక్కడ రైతులకు మాత్రం కష్టాలు తప్పలేదు. ఎమ్మెల్యేగా గెలిచిన తక్షణం శాశ్వత మార్గం చూపేలా ప్రత్యేక నిపుణుల బృందాన్ని రప్పిస్తాం. సమగ్ర అధ్యయనం చేయించి, పొలాలను ఇసుక కమ్మేయకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడతాం.

సాక్షి: రాయదుర్గంలో ఆగిన పనులను పూర్తి చేస్తారా?

మెట్టు: రాయదుర్గం పట్టణ రూపురేఖలు మారుస్తాం. అర్ధంతరంగా ఆగిన రైల్వే అండర్ పాస్ ఓవర్ బ్రిడ్జిలు పూర్తి చేయించి, ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపుతాం. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 కోట్లతో ముంపు ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య తీరుస్తాం. లైట్లు, పారిశుద్ధ్యం మెరుగునకు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థకు పెద్దపీట వేస్తాం. పార్కుల్లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం.

సాక్షి: టీడీపీ పాలనపై మేరేం చెబుతారు?

మెట్టు: ఈ సారి నీతికి, అవినీతికి మధ్య ఎన్నికలు జరుగుతున్నాయి. చంద్రబాబు అపద్ధపు హామీలు, మోసాలు, టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు విచ్చలవిడి అవినీతి గురించి ప్రజలకు తెలుసు. ప్రజా సేవ చేస్తారని 2014లో టీడీపీకి అధికారం ఇస్తే, ప్రజల రక్తాన్ని పీల్చారు. నీరు-చెట్టు, అక్రమ ఇసుక, మట్టి రవాణాలో రూ.కోట్లు దోచేసిన ఉదంతాలు నేటికీ వినిపిస్తున్నాయి. ఎన్నికల ప్రచారాల్లో ఎక్కడికెళ్లినా ప్రజలు ఇదే చెప్తున్నారు.

సాక్షి: వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తారా?

మెట్టు: వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోవడం ఎవరితరం కాదు. సీఎం వైఎస్ జగన్ 58 నెలల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమమే మా పార్టీకి బలం. డీబీటీ ద్వారా అక్క, చెల్లెమ్మల ఖాతాలకు రూ.2.75 లక్షల కోట్లు జమ చేశారు. అభివృద్ధికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. నా రాజకీయ ప్రత్యర్థి, టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు ఎలాంటి వాడో ప్రజలందరికీ తెలుసు. టీడీపీ గెలిస్తే కరువుతో పాటు దౌర్జన్యాలు పెచ్చుమీరుతాయి.

ఊరూరా 'మెట్టు'కు ప్రజల బ్రహ్మరథం


ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి ఎన్నికల ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. కుటుంబ సభ్యులు ప్రచారంలో మునిగితేలారు. ఫ్యాన్ గుర్తుకు ఓటును వేసి, మెట్టు గోవిందరెడ్డిని గెలిపించాలని మండే ఎండను సైతం లెక్కచేయకుండా ఇంటింటా ప్రచారం చేశారు. ఓ పక్క రోడ్ షోలో అభ్యర్థి మెట్టు ఓటర్లను ఆకట్టుకుంటుండగా, భర్త విజయం కోసం భార్య యశోదమ్మ, తండ్రి విజయం కోసం తనయుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి అలుపెరుగని ప్రచారం చేశారు. కోడలు మెట్టు శాంభవి మహిళలతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రతి నాయకుడు, కార్యకర్తలకు మెట్టు గోవిందరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

ముగిసిన ఎన్నికల ప్రచారం

కణేకల్లు: సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి తెరపడింది. శనివారం చివరిరోజు మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జోరుగా ప్రచారం నిర్వహించారు. సొల్లాపురం, కణేకల్లుక్రాస్, కణేకల్లు, గరుడచేడు, యర్రగుంట, మాల్యం, పెనలకపాడు, గెనిగెర, బ్రహ్మసముద్రం, 43ఉడేగోళం, పులచెర్ల తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా సాగింది.

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడులో జెడ్పీ మాజీ సభ్యుడు వన్నప్ప ఆధ్వర్యంలో శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా మెట్టు గోవిందరెడ్డి, ఎంపీగా మాలగుండ్ల శంకరనారాయణను గెలిపించాలని కోరారు. మండలంలోని గొల్లపల్లి,జాలివంక గ్రామాల్లో మండల కన్వీనర్ గోని లక్ష్మీకాంతారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ప్రచారం చేశారు.


కలుగోడులో ప్రచారం చేస్తున్న జెడ్పీ మాజీ సభ్యుడు వన్నప్ప


గొల్లపల్లిలో ప్రచారం చేస్తున్న మండల కన్వీనర్ గోని లక్ష్మీకాంతారెడ్డి


కణేకల్లు క్రాస్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


మెట్టు తరఫున ప్రచారం చేస్తున్న సతీమణి యశోదమ్మ


మామ మెట్టు గోవిందరెడ్డిని గెలిపించాలని ప్రచారం చేస్తున్న మెట్టు శాంభవి


తండ్రి విజయం కోసం ఓటు అభ్యర్థిస్తున్న మెట్టు తనయుడు విశ్వనాథరెడ్డి


ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలంటున్న మెట్టు కుశాల్‌రెడ్డి

ముగిసిన 'సార్వత్రిక' ప్రచార పర్వం

కళ్యాణదుర్గం: సార్వత్రిక ఎన్నికల ప్రచార ఘట్టం శనివారం సాయంత్రం 6 గంటలకు ముగిసింది. ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. గ్రామాల్లో ప్రచారంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తలారి రంగయ్య దూసుకుపోయారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. టీడీపీ అభ్యర్థి అమిలినేని ప్రచారం చప్పగా సాగింది. గ్రామాల్లో ఎండకు తట్టుకోలేక కొద్ది రోజులు ప్రచారం నిలిపివేశారు. ప్రచారం జరిగినన్ని రోజులూ భానుడు తన ప్రతాపాన్ని చూపారు. గ్రామాల్లో ప్రజలు ఎండను సైతం లెక్కచేయకుండా ప్రచారాల్లో పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించండి

కంబదూరు: ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే,ఎంపీ అభ్యర్థులు తలారి రంగయ్య, శంకరనారాయణను గెలిపించాలని జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు నీలి శంకరప్ప కోరారు. శనివారం మండలంలోని గుద్దెళ్ల, కంబదూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాపూజీ, నాయకులు మల్లూరి వెంకటేశులు, వసంతరాయుడు, చంద్ర, రామస్వామి, మల్లేశప్ప, పవన్, ప్రసాద్, రామాంజి, నాగరాజు, అజయ్, ఈడిగ మారుతి తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న ఎల్ఎం ఉమాదేవి


గుద్దెళ్లలో ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు,నాయకులు


ఎండను లెక్కచేయకుండా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య

ఎల్ఎం మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం

కళ్యాణదురం రూరల్: ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమా, వైఎస్సార్‌సీపీ నేత ఎల్ఎం మోహన్‌రెడ్డి ఓటర్లను కోరారు.శనివారం మండలంలోని ఓబుళాపురం గ్రామంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు గోపాల్, ఆంజనేయులు, లాయర్ దాదా, అంజి, దొణతిమ్మ పాల్గొన్నారు.